క్లుప్తంగా

పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు శంకర్

మంచిర్యాలఅర్బన్: స్థానిక పీఆర్‌టీయూ టీఎస్ భవనంలో 55వ పీఆర్‌టీయూ ఆర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొట్టి శంకర్ జెండా ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ రిటైర్డు సంఘం నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి గ్రామ శివారులో పత్తి చేళ్లల్లో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు, ఒకరు పరారయ్యారని చెప్పారు. వారి నుంచి రూ.6వేల నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కుశ్నపల్లి గ్రామానికి చెందిన ఎనగంటి సంపత్, గంగిరెడ్డి రమేష్, రావల్లి రాజయ్య, బెల్లంపల్లి మధుకర్‌రెడ్డిలను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. మండిగ రమేష్ పారిపోయాడని వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలతో మహిళలు

జన్నారం: మండలంలోని కలమడుగు శ్రీ నరనారాయణ స్వామి వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయం సమీపంలోని అగ్గి మల్లన్న దేవుడికి యాదవ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలు సమర్పించారు. ఒగ్గు కళాకారులు మల్లన్న దేవుని మహిమలు తెలిపే కథలను పాటల రూపంలో తెలియజేశారు. అగ్నిగుండాలు తొక్కారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ

మందమర్రిరూరల్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో న్యూడ్రాగన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో మందమర్రికి చెందిన గోలేటి సాయిష్ గోల్డ్ మెడల్ సాధించాడు. అండర్–14 కటాస్ విభాగంలో మందమర్రికి చెందిన బీఎంఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొనగా సాయిష్ సత్తా చాటాడు. కరాటే మాస్టర్ కర్ర వెంకటేశ్, సినీ యాక్టర్ భానుచందర్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

కల్వారి ఆశ్రమానికి వృద్ధురాలి అప్పగింత



అప్పగిస్తున్న ప్రభుత్వాసుపత్రి సిబ్బంది

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో నాలుగు నెలలుగా ఉంటున్న మతిస్థిమితం లేని వృద్ధురాలిని ఆదివారం జిల్లా కేంద్రంలోని కల్వారి యువశక్తి అనాథ, వృద్ధాశ్రమానికి ఆసుపత్రి సిబ్బంది అప్పగించారు. నాలుగు నెలల క్రితం 70ఏళ్ల వృద్ధురాలు మంచిర్యాల మార్కెట్ ఏరియాలో మతిస్థిమితం సరిగ్గా లేకుండా నిస్సాహాయ స్థితిలో రోడ్డు పక్కన పడి ఉండగా, స్థానికులు మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. నాలుగు నెలలు అవుతున్నా వృద్ధురాలి కోసం ఎవరూ రాకపోవడంతో ఆసుపత్రి మానసిక వైద్యుడు డాక్టర్ అజ్మీర్ రాముునాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రారెడ్డి స్థానిక కల్వారి ఆశ్రమం నిర్వాహకులు కల్వారి కుమార్‌కు అప్పగించారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు తమ ఆశ్రమంలో సంప్రదించాలని, వివరాలకు 97019 73636, 93810 18678కు గాని, స్థానిక పోలీసుస్టేషన్‌లో గాని సంప్రదించాలని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

భీమిని: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు మెరుగు పడుతాయని కన్నెపల్లి ఎస్సై గంగారాం అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఆదివారం సీసీ కెమెరాలు ఏ ర్పాటు చేయించారు. అనంతరం టేకులపల్లి, జన్కాపూర్, జజ్జరవెల్లి గ్రామాల్లోని ప్రజలకు సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు.

దారులు ధ్వంసం..!



భీమిని: కన్నెపల్లి మండల కేంద్రం నుంచి రెబ్బెన గ్రామం వరకు బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో అటు వైపుగా వాహనాల్లో ప్రయాణం చేయాలంటే ప్రజలు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని నూతన బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టేలా చూడాలని కోరుతున్నారు.



చెన్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్, పొన్నారం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. గుంతలుగా మారి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సింగరేణిని సంరక్షించుకోవాలి

- సేవ్ సింగరేణి పేరుతో ఉద్యమం
- గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ ప్రమాదపుటంచుల్లో ఉందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. ఐదేళ్ల క్రితం సంస్థ ఉన్న పరిస్థితులు, నేటి పరిస్థితులను చూస్తే పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా తయారైందన్నారు. సంస్థ కార్యకలాపాలను నిర్వహించడంలో కీలకంగా ఉండే డైరెక్టర్ పోస్టులను కూడా భర్తీ చేయడం లేదన్నారు. నాలుగు డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. డైరెక్టర్ (పా) వంటి కీలక పోస్టును కూడా ఇన్‌చార్జీతో నడిపిస్తున్నారన్నారు. సంస్థలో సేఫ్టీ పరికరాలు కొనడానికి కూడా నిధులు లేవన్నారు. ఉద్యోగుల జీతాలకు కూడా డబ్బులు ఉండటం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.23 వేల కోట్లు బకాయిలను పెడితే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రూ. 32 వేల కోట్లకు పెంచిందని తెలిపారు. సంస్థకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో నిధుల కొరత ఏర్పడిందన్నారు. కార్మికులకు చికిత్సలు అందిస్తున్న సింగరేణి నెట్వర్క్ కార్పొరేట్ ఆస్పత్రులకు మెడికల్ బిల్లులు చెల్లించకపోవడంతో వారు కార్మికులకు వైద్యం చేయడానికి నిరాకరిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లకు సైతం డబ్బులు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మరో పక్క కోల్ ఇండియా నుంచి తక్కువ ధరకే మార్కెట్‌లో బొగ్గు లభించడంతో సంస్థ తీవ్ర పోటీ ఎదుర్కొంటోందని తెలిపారు. స్ట్రక్చరల్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను కూడా యజమాన్యం అమలు చేయడం లేదని వెల్లడించారు. కోయగూడెం, సత్తుపల్లి, తాడిచర్ల బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు 13 ఏళ్లుగా వేతనాలు పెరగలేదని సత్వరమే వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సింగరేణిని రక్షించే చర్యను ప్రభుత్వం చేపట్టడం లేదన్నారు. మరోపక్క రాజకీయ జోక్యం మితిమీరిందన్నారు. ఈ పరిస్థితుల్లో సింగరేణిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. దీనికోసం ప్రభుత్వ పెద్దలను కలిసి వినతిపత్రాలు ఇస్తామని వారు స్పందించకుంటే కార్మికులు, అన్ని కార్మిక సంఘాలతో కలిసి సేవ్ సింగరేణి పేరుతో ఉద్యమిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, సహాయ కార్యదర్శి కొమురయ్య, నాయకులు ప్రసాద్‌రెడ్డి, నాగభూషణం, రామచందర్, నెరవేట్ల మల్లేశ్, మురళిచౌదరి, సదానందం, నగేష్, అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత జనరల్ షిఫ్ట్ టీం



విజేతగా నిలిచిన జనరల్ షిఫ్ట్ టీం

శ్రీరాంపూర్: యువ కార్మికుల క్రికెట్ లీగ్‌లో జనరల్ షిఫ్ట్ టీం విజేతగా నిలిచింది. నస్పూర్ నాగార్జున కాలనీలోని ప్రాణహిత మైదానంలో ఆదివారం ఎస్సార్పీ 3 గని యువ కార్మికులకు క్రికెట్ లీగ్ మ్యాచ్ నిర్వహించారు. ఈ పోటీలకు గని యాక్టింగ్ మేనేజర్ ఎండపల్లి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో ఫైనల్ మ్యాచ్ సీ రిలేకు, జనరల్ మజ్దూర్ జట్టుకు మధ్య జరిగింది. ఇందులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సీ రిలే జట్టు 10ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 71పరుగులు చేసింది. తరువాత జనరల్ షిఫ్ట్ టీం బ్యాటింగ్ చేసి 10ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 72పరుగులు చేసింది. దీంతో విన్నర్‌గా జనరల్ షిఫ్ట్ టీం, రన్నర్‌గా సీ రిలే జట్టు నిలిచింది. గనిపై సోమవారం జరిగే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో అండర్ మేనేజర్లు అరుణ్‌కుమార్, మధుసూదన్, మల్లిఖార్జున్, రామకృష్ణ, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ మురళీచౌదరి, ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రెటరీ రిక్కుల గోపాల్‌రెడ్డి, నాయకులు పెట్టం శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ వెంకట్‌రెడ్డి, బీఎంఎస్ నాయకులు భీమన్నతో పాటు ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు శశిధర్, రణదీప్, బొమ్మ వెంకటేశ్ పాల్గొన్నారు.

'హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం'



మాట్లాడుతున్న నాయకులు

భీమారం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ విఫలమయ్యారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రచురించిన క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. జైపూర్‌లోని పవర్ ప్లాంట్‌లో 20వేల మంది స్థానికులకు ఉపాధి కల్పిస్తానని వివేక్ హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని, భీమారంలో గ్రౌండ్ పేరుతో కాంగ్రెస్ నాయకులు మొరం అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు దాసరి మధునయ్య, మణిదీప్, నరహరి, ప్రణీత్ గౌడ్, సాగర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ప్రాంతీయ సదస్సు



పురస్కారాలతో లయన్స్ క్లబ్ సభ్యులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 2024–25 ప్రాంతీయ సదస్సు(రీజియన్ మీట్) నిర్వహించారు. ఈ సందర్భంగా జూలై నుంచి జనవరి వరకు లయన్స్ క్లబ్ మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను బెస్ట్ లయన్స్ క్లబ్‌గా మంచిర్యాల లయన్స్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్‌గా లయన్ బాలమోహన్, బెస్ట్ యాక్టివిస్ట్‌గా మధుసూదన్‌రెడ్డి, బెస్ట్ ట్రెజరర్‌గా వెంకటేశ్వర్‌రావుకు వివిధ సేవా రంగాల్లో సేవలందించిన సభ్యులకు వ్యక్తిగత అవార్డులు లభించాయని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్ తెలిపారు. ఇకపై జిల్లా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన, కంటి శస్త్రచికిత్స శిబిరాలు నిర్వహించనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, బాలమోహన్, కారుకూరి చంద్రమౌళి, వినయ్‌కుమార్, డా.సుగుణాకర్‌రెడ్డి, సూర్యనారాయణ, గుండా శ్రీనివాస్, శ్రీధర్‌బాబు, వెంకటేశ్వర్‌రావు, చందూరి మహేందర్, డేగ బాపు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు

బెల్లంపల్లి/కోటపల్లి/జైపూర్: ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడాన్ని పురస్కరించుకొని ఆదివారం బెల్లంపల్లి, కోటపల్లి, జైపూర్ మండలాల్లో కమలనాథులు విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టపాసులు పేల్చి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు.

ఢిల్లీకి బయలుదేరిన ఎల్‌ఐసీ ఏజెంట్‌లు

పాతమంచిర్యాల: ఎల్‌ఐసీ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 11న ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట జరిగే మహాధర్నాకు జిల్లా నుంచి ఎల్‌ఐసీ ఏజెంట్‌లు ఆదివారం తరలివెళ్లారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎల్‌ఐసీ ఏజెంట్‌ల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బీమా ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి, మహేష్, లక్ష్మినారాయణ, తిరుపతయ్య.స్వామి, వేణు, ఆశీర్‌విల్సన్, రాజు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

జన్నారం: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పడిన గుంతలను జీపు, టాటా ఏసీ యూనియన్ ఆధ్వర్యంలో పూడ్చివేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో మట్టిని తెప్పించి, గుంతలు పూడ్చివేయించారు.

అ'పూర్వ' సమ్మేళనం



శ్రీరాంపూర్: సుదీర్ఘ కాలం తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా గడిపారు. సీసీసీలోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మంచిర్యాల పట్టణంలోని హరిత ఫంక్షన్‌హాల్లో కలుసుకున్నారు. తరగతి గదిలో నాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం జీవితంలో ఎలా స్థిరపడ్డారో, కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి టీచర్లను సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులంతా నృత్యాలు, విందు వినోదాలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు స్వర్ణరాజ్, తాల్ల మహేశ్, మల్లేశ్, నలిగేటి శ్రీకాంత్, మహేందర్, సుధాకర్, కవిత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..!



భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం వద్ద పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో సింగిల్ రోడ్డు ఉన్న సమయంలో అధికారులు వాహనాల వేగాన్ని అదుపుచేసేందుకు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేశారు. రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసినప్పటి నుంచి స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆవిడం రోడ్డు వద్ద గతంలో టిప్పర్ ఢీ కొనడంతో ఒక బాలుడు మృతి చెందాడు. బస్టాండ్ ప్రాంతంలో అనేక ప్రమాదాలు జరిగిన సంఘటనల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మంచిర్యాల నుంచి వచ్చే వాహనాలు అధికవేగంగా వస్తున్నాయని ప్రజలు తెలిపారు. ఈ విషయంలో పోలీసులు, నేషనల్ హైవేస్ అధికారులు కలిసి స్పీడ్ బ్రేకర్లతో పాటు స్టాపర్లు ఏర్పాటు చేస్తే వాహనాల వేగాన్ని కొంత మేరకు తగ్గించవచ్చునని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



దండేపల్లి: ఓటు అభ్యర్థిస్తున్న సంఘ నాయకులు

దండేపల్లి: ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ దండేపల్లి మండలంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టి శంకర్, బచ్చ మోహన్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులను కలిసి పీఆర్‌టీయూ టీఎస్ బలపరిచిన అభ్యర్థికి ఓటెయ్యాలని కోరారు. ప్రచారంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావనవేని రవి, మల్యాల మల్లేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహేశ్వర్, నాయకులు పాత రమేష్, నరేందర్, రామరాజు పాల్గొన్నారు.

కన్నెపల్లిలో ధర్నా



భీమిని: కన్నెపల్లి మండల కేంద్రానికి దూరంగా, సబ్‌స్టేషన్ దగ్గరలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయడం సరికాదని, మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పక్కన గల ప్రభుత్వ స్థలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదివారం స్థానిక బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, ప్రజలతో కలిసి ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. కొంతమంది నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం సబ్‌స్టేషన్ దగ్గరలో ఆస్పత్రి నిర్మిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేతన వెతలు

- సమగ్ర శిక్ష ఉద్యోగుల ఇబ్బందులు
- రెండు నెలలుగా పెండింగ్

కాసిపేట: నాడు సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఆందోళన బాట పట్టిన తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు నేడు వేతనాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. విద్యాశాఖలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు రెగ్యులరైజేషన్, మినిమం టైం స్కేల్, పే స్కేల్ అంశాలపై ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గత డిసెంబర్ 10 నుంచి జనవరి 6వరకు సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్రాల్లో కొనసాగిన 27రోజుల దీక్షలు, రాష్ట్ర వ్యాప్త సమ్మెతో ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఉద్యోగులతో చర్చలు జరిపి సమ్మె విరమించాలని కోరారు. ఆర్థికేతర సమస్యలు పరిష్కరించి ఆర్థికపరమైన అంశాలపై సబ్ కమిటీ ఆధారంగా మూడు నెలల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. సమ్మె కాలం నాటి వేతనాలు త్వరగా చెల్లించడంతోపాటు ఆర్థికేతర సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలో మండల, పాఠశాల స్థాయిల్లో ఎంఐఎస్, సీసీవో, సీఆర్పీ, ఐఈఆర్పీ, కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది, పీటీఐలు, జిల్లా స్థాయిలో డీపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు మొత్తంగా 19,320మంది ఉండగా.. జిల్లాలో 62మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. సమ్మె విరమణ అనంతరం సమస్యలు, సమ్మె కాలం వేతనాలు పక్కనపెడితే.. వీరికి చెల్లించాల్సిన డిసెంబర్, జనవరి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించడంతోపాటు వేతనాలు త్వరగా విడుదల చేయాలని కోరుతున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



శుద్ధజలం అందరిపై చల్లుతున్న పూజారులు

కోటపల్లి: మండలంలోని ఎదులబంధం గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ బోనాల జాతర ఆది వారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయాన్నే గ్రామస్తులు అమ్మవార్ల విగ్రహాలను తీసుకుని కాలినడకన డప్పు చప్పుళ్లతో సుమారు 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న పార్‌పల్లి సమీపంలోని గోదావరి నదికి చేరుకున్నారు. అక్కడ అమ్మవార్ల విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. గోదా వరి నది తీరంలోని ఇసుకలో పసుపుతో పట్నాలు వేసి శివసత్తుల పునకాల మధ్య బో నం వండి నైవేద్యం సమర్పించారు. అనంతరం కొత్త కుండలో గోదావరి జలాలతో గ్రామానికి చేరుకుని అమ్మవార్లను పునఃప్రతిష్ఠ చేశారు. సాయంత్రం మధునపోచమ్మ బోనాలు సమర్పించారు.



దేవతామూర్తులకు జలాభిషేకం



గోదావరి తీరంలో శివసత్తుల పూనకాలు